## స్వర్ణ నారావారిపల్లి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష



చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమం ద్వారా నారావారిపల్లిలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులతో సమీక్షించారు. స్వర్ణ నారావారిపల్లి కార్యక్రమం ద్వారా నారా వారిపల్లిలో ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, ఏ.రంగంపేట జడ్పీ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దడం, 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఈ సంజీవినీ ప్రాజెక్టు, టాటా డిఐఎన్‌సి, శ్రీశేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయానికి వెళ్ళే దారికి సిసి రోడ్డు పనులను, మూలపల్లి చెరువు, 33/11 కెవి ఇండోర్ సబ్ స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని డిపిఓ, స్వర్ణ నారావారిపల్లి స్పెషలాఫీసర్ డి.సుశీలాదేవితో కలసి పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## స్వర్ణరథంపై శ్రీమంతుడు



తిరుమల,డిసెంబర్30 ప్రభాతవార్తప్రతినిధి : ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం ఎంతో పవిత్రమైన బంగారురథంపై శ్రీదేవిభూదేవిసమేతుడైన మలయప్పస్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్దనుంచి బయలుదేరింది. శ్రీదేవిభూదేవిమలయప్పస్వామి వారిని అర్చకులు విశేషాభరణాలతో అలంకరించారు. బంగారురథంమీద కొలువుదీరి ఊరేగిన మలయప్పను దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథోత్స వంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడిఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ, బోర్డు మహిళ సభ్యులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, అర్చకులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# కలియుగ "వైకుంఠ"మే!






తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి: దేవలోకంలో వైకుంఠాన్ని తలపించేలా కలియుగవైకుంఠం తిరుమలను టిటిడి అధికారులు అద్భుతంగా ఫల,పుష్పఅలంకరణలు, విద్యుద్దీపకాంతులతో చక్కగా తీర్చిదిద్దారు. ఆలయంలోపల, వెలుపల సువాసనల పుష్పాలతో ఆధ్యాత్మిక అనుభూతి కలిగించేలా తీర్చిదిద్దారు. తిరుమలగిరులు గోవిందనామంతో మారుమోగుతున్నాయి.

## మోక్షమార్గం దర్శనంతో సంతషించిన భక్తజనం



తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి: ఇలవైకుంఠం తిరుమలక్షేత్రం ఆద్యంతం భక్తికోటి గోవిందనామంతో పులకించింది. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళ వారం వేకువజామున నుండి రాత్రివరకు ఆనందనిలయంలో పవిత్ర మైన ముక్తిద్వారాలు తెరచి భక్తులకు మోక్షం కల్పించారు.వేకువజామున ఒంటి గంటకు ప్రత్యేక పూజలతో వైకుంఠవాకిళ్ళను తెరిచారు. తొలుత ప్రాధాన్యత ప్రముఖుల దర్శనాలు చేయించి ఆ తరువాత ఉదయం 6గంటలకే సామాన్యభక్తులను అనుమతించడంతో ఆనందంతో పరవశులయ్యారు. ప్రతి ఏడాది ధనుర్మాసంలో ఏకాదశి ఘడియల్లో వైకుంఠద్వారం తెరిచి భక్తులకు ముక్తిని కల్పించడం పరిపాటి. ఈ ఏడాది కూడా పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో ముందుగా వైకుంఠ ఏకాదశి ఘడియలు మొదలవడంతో ప్రణాళికాబద్ధంగా ఆన్‌లైన్‌లో దర్శన టోకెన్లు తొలిమూడురోజులకు జారీచేయడంతో ఎక్కడా ఎలాంటి తోపులాటలు, భక్తుల మధ్య రణగొనులు లేకుండా రోజుకు 60వేలమంది భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు కలిగింది. వేకువజామున ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, డాక్టర్ మురళి, పులివర్తినాని, తుడ ఛైర్మన్,టిటిడి బోర్డు సభ్యుడు సి.దివాకర్‌రెడ్డి, ఎంపిలు డాక్టర్ గురుమూర్తి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీమంత్రి ఆర్‌కెరోజాతో బాటు ఇంకా పలువురు ప్రముఖులు, తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష,టిడిపి నాయకులు, అధికారులు తదితర ప్రముఖులు వైకుంఠద్వారదర్శనం చేసుకున్నారు. వీరందరికీ స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓఅనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ వర్గాలు చక్కటి సంతృప్తికర దర్శనం చేయించారు. టోకన్లు కలిగిన భక్తులు సమయానికి తిరుమలకు చేరుకుని దర్శనం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

### కల్యాణ వెంకన్న ఆలయంలో
## పోటెత్తిన భక్తజనసందోహం



చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణవెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం పోటెత్తిన భక్తజనసందోహం స్వామి వారి దర్శన భాగ్యంతో పరవశించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా తమ ఆరాధ్యదైవం శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుండే ఆలయం వెలుపల బారులు తీరారు. గతంలో చోటుచేసుకున్న తిరుపతి దుర్ఘటన దృష్ట్యా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేక ఏర్పాట్లకు ఆదేశాలు ఇచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఓ ఎం.గోపినాద్, సూపరింటెండెంట్స్ రాజ్‌కుమార్, వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ డి.మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, డిఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సిఐలు సురేష్‌కుమార్, మహబూబ్ భాషా, సుదర్శన ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐలు రవిప్రకాష్ రెడ్డి, అరుణాచలం, మురళీమోహన్, సూర్యనారాయణ రెడ్డి, వివిధ హోదాలో గల సుమారు 200 మంది పోలీసులు, విజిలెన్స్ యంత్రాంగం భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తనీయక ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## రాయుడుది హత్యకాదు: ఆత్మహత్యా?!

**విచారణాధికారిని నియమించిన తమిళనాడు పోలీసు ఉన్నతాధికారులు**

శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తి జనసేన మద్దతుదారుడు రాయుడుది హత్యకాదని, ఆత్మహత్య అని పోలీసులు కేసును మార్చారు.తమిళనాడు పోలీసులు ఈ కేసుకు సంబంధించి విచారణకు ప్రత్యేకాధికారిని నియమించటం సోమవారం రాత్రి తమిళనాడు పోలీసులు ఇక్కడకు వచ్చి మంగళవారం ఉదయం కూడా విచారించారు. మొదట తమిళనాడు పోలీసులు ఈ కేసును 'హత్య కేసు'గా నమోదు చేసారు.అయితే పోస్టు మార్టం నివేదిక ఆధారంగా ఇది హత్యకాదని,ఆత్మహత్య అని మార్చారు.ఈ హత్యకు బలమైన రాజకీయ కుట్ర ఉందని పోలీసులకు ప్రాథమికంగా ఆధారాలు సంపాదించినట్లు తెలిసింది.ఈ కేసుకు సంబంధించి విచారణకు ఒక డిఐయస్‌పి ఎస్ఐ ఇద్దరు,ఎనిమిది మంది కానిస్టేబుల్స్‌ను నియమించారు.ఈ కేసుకు సంబంధించి పేట చిరంజీవి,పేట చంద్రశేఖర్‌ను సోమవారం రాత్రి వారి షాపులో విచారించారు.వారు తమను న్యాయవాది సమక్షంలో విచారించాలని కోరారు. మంగళవారం ఉదయం కూడా తమిళనాడు పోలీసులు విచారించారు.కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి:

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినూత కోట వద్ద డ్రైవర్‌గా రాయుడు పని చేసే వారు. ఆతను ఈ ఏడాది జూలై 8న హత్యకు గురైనట్లు శవం తమిళనాడు హద్దులోని ఓ నది వద్ద లభ్యమవటంతో



పేట బ్రదర్స్‌ను విచారిస్తున్న తమిళనాడు పోలీసులు

తమిళనాడు పోలీసులు ఇది హత్యగా భావించారు. సిసి ఫుటేజీల అధారంగా కారు నెంబర్ల ఆధారంతో రాయుడు యజమాని వినూత కోట, చంద్రబాబు కోటలను అదుపులో తీసుకున్నారు. కోర్టులో వారు బెయిల్ పొందారు. అయితే హత్యకు ముందు రాయుడు రికార్డు చేసిన సెల్ఫి ని పరిశీలించగా అలాగే పోస్టు మార్టంలో ఇది ఆత్మహత్య అని డాక్టర్లు నిర్ధారించటంతో కేసు కొత్త మలుపు తిరిగింది.రాయుడు ఆత్మహత్యకు సంబంధించి పోలీసులకు దొరికిన ఆధారాలతో కూటమి నాయకులకు నోటీసులు జారి చేస్తూ విచారణకు హాజరు కావాలని సూచించినట్లు సమాచారం.అంతేకాక రాయుడు కేసుకు సంబంధించి గతంలో తమిళనాడు పోలీసులు నమోదు చేసిన సెక్షన్ 302ను అల్టర్ చేస్తూ ఐపిసి 306,/108 బియన్ఎస్‌లుగా మార్పు చేసినట్లు తెలిసింది. అయితే ఆతను ఆత్మహత్యకు సంబంధించిన కారణాలేమిటో అనే దిశగా తిరిగి విచారణ జరుపుతున్నట్లు సమాచారం అందింది.కూటమికి చెందిన నాయకునితో పాటు జనసేనకు చెందిన ముగ్గురినిలను చార్జి షీట్‌లో చేర్చనున్నట్లు తెలిసింది.కేసు విచారణలో భాగంగా ఎసిపి దక్షిణామూర్తి సారధ్యంలో బృందం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. విచారణ జరిపారు.రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపిన ఈ కేసుకు సంబంధించిన విచారణను సిబి-సిఐడి లేదా సిబిఐకి బదిలి చేసి నిజాలు నిగ్గుతేల్చటానికి వినుత కోటా సుప్రీంకోర్టును ఆశ్రయించటానికి ప్రయత్నిస్తున్నట్లు కూడా శ్రీకాళహస్తిలో చర్చలు జరుగుతున్నాయి. ఆది నుంచి అరెస్టు అయిన వినూత కోట, చంద్రబాబు కోటలుఈ కేసు కేవలం రాజకీయ కుట్ర అని దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని చెబుతున్నారు.మరి ఈకేసు ఎన్ని మలుపులు తిరుగుతుందో? ఎవరెవరు ఇందులో భాగస్వాములౌతారో వేచి చూడాలి.

## తుమ్మలగుంటలో వైకుంఠ ద్వార దర్శనం



తిరుపతిరూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: తిరుపతి నగరానికి అనుకునివున్న తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుఝూమున 4గంటల నుంచే వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆగమోక్త పూజల అనంతరం వైకుంఠ ద్వారా లను తెరిచి భక్తులకు దర్శనావకాశం కల్పించారు. తిరుమలకు వెళ్లలేని భక్తులు పెద్ద సంఖ్యలో తుమ్మ లగుంటకు చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక ఆకర్షణగా ఆనంద నిలయం, గరుడ ద్వారం, సప్త ద్వారాలను ఏర్పాటు చేయగా, భక్తులు విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. చెవిరెడ్డి కుటుంబీకులు చేపట్టిన పుష్పాలంకరణలు భక్తులకు అందించిన సేవలు ప్రశంసలు అందుకున్నాయి. క్యూలైన్లలో ఇబ్బందులు లేకుండా గంటలోపు దర్శనం కల్పించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. తెల్లవారుఝూమున నుంచి అర్ధరాత్రి వరకు సర్వదర్శనం కొనసాగగా సుమారు 75వేల మందిపైగా భక్తులు వైకుంఠ ద్వార ప్రవేశం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇవో సుబ్బరామిరెడ్డి, తుడ మాజీ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం
## ఉపాధ్యక్షుడిగా గంజి మాధవయ్య



పుత్తూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త : పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ గంజి మాధవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడు జి.వి.నాగేశ్వరరావు ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. గతంలో ఈయన పుత్తూరు మండలాధ్యక్షుడిగా, ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంధాలయ శాఖ డైరక్టర్‌గా, తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. పద్మశాలి సామాజిక వర్గ అభ్యున్నతికి ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి మాధవయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈయన ఎన్నిక పట్ల రాష్ట్ర స్థాయి నాయకులు పలువురు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన సహకారంతో సంఘం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాధవయ్య మాట్లాడుతూ పద్మశాలి కులస్తుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదు ద్వారా గ్రామ, మండల, జిల్లా స్థాయి నుంచి సామాజిక వర్గాన్ని ఏకతాటి పైకి తీసుకువచ్చి ఐక్యత సాధించేందుకు నిర్విరామ కృషి చేస్తానన్నారు. పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ హోదాలో పద్మశాలి సామాజిక వర్గంలో నేత జీవనాన్ని కొనసాగిస్తున్న వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా నేత పనిలో ఆధునిక పద్దతులను అమలు చేయడంతో పాటు ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు.

### ప్రశాంత వాతావరణంలో
## న్యూ ఇయర్ వేడుకలు

- నేటి రాత్రి 10 గంటల నుండి ముమ్మరంగా వాహనాల తనిఖీ
- మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయంలో క్లోజ్
- ప్రధాన రోడ్లు, ఫ్లైఓవర్లపై వేడుకలు నిషిద్ధం - ఎస్పీ తుషార్ డూడి



చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చుకోవాలని, డిసెంబర్ 31 రాత్రి అంటే బుధవారం రాత్రి చిత్తూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా రోడ్లపై చెక్‌పోస్టులు, పికెట్లు ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తామని ఎస్పీ తుషార్ డూడి పేర్కొన్నారు. బుధవారం రాత్రి 10 గంటలపై ప్రజలు అనుసరిం చాల్సిన మార్గదర్శకాలను ఎస్పీ విడుదల చేస్తూ మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయంలో మూసి వేయాలని, చిత్తూరు నగరంలో ప్రధాన రహదారులు, ఫ్లై ఓవర్లపై నూతన సంవత్సర వేడుకలు నిషిద్ధమని, స్పెషల్ డ్రైవ్‌లో బ్రీత్ అనలైజర్ ద్వారా ఎవరైనా పట్టుబడితే వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి రిమాండ్‌కు పంపుతామని, హోటళ్ళు, ఫంక్షన్ హాళ్ళు, ప్రైవేటు స్థలాల నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. వేడుకల ప్రాంగణాల్లో తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ని ఛవారం రాత్రి మొత్తం బ్లూకోట్, రక్షక్ టీమ్‌లు గస్తీ నిర్వహిస్తాయన్నారు.

## కాణిపాకంలో నేత్రపర్వంగా ఉత్తరద్వార దర్శనం



కాణిపాకం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీదేవి, భూదేవి పెరింయదేవి సయిత శ్రీవరదరాజస్వామి ఆలయంలో మంగళవారం ఉత్తరద్వార దర్శనం నేత్రపర్వంగా నిర్వహిం చారు.మంగళవారం ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఆలయంలో శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరద రాజ స్వాముల వారి మూలవిరాట్‌లకు వేకువజామున 3 గంటలకు ఆలయ ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాస భట్టాచార్యులు ఆధ్వర్యంలో అర్చ కులు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా పంచామృ తాభిషేకాలు, స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించగా... అలంకరించిన శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వారి ఉత్సవమూర్తులను పవిత్రమైన ఉత్తరద్వారం వైపు వుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. వరదరాజస్వామివారి ఆలయాని న్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సయిత శ్రీవరదరాజ స్వాముల వార్లకు ఆలయ ఛైర్మన్ వి.సురేంద్రబాబు,ఈఓ కె.పెంచల కిషోర్‌లు ఆలయ అధికారులు, అర్చకులు, పాలకమండలి సభ్యులతో కలసి ప్రధాన ఆలయం నుండి పట్టువస్త్రాలను, పూజా సామా గ్రిని ఊరేగింపుగా తీసుకువెళ్ళి అర్చకులకు సమర్పించారు. పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి అమ్మవార్లకు మంగళవారం ఉదయం గ్రామోత్స వంను ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారా దర్శనం కల్పించిన అనంత రం అలంకరించిన స్వామి, అమ్మవార్లలను పురవీధుల్లో ఊరేగించారు.

## వైకుంఠ ఏకాదశి: ఉత్తరద్వార దర్శనం





శ్రీకాళహస్తి, డిసెంబర్ 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ముక్కోటి ఏకాదశి సందర్భంగా కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు పూల అందాలతో ముస్తాబు చేసారు.అలాగే అనుబంధ ఆలయం అయిన ప్రసన్న వరదరాజస్వామి ఆలయం కొన్ని సంవత్సరాలుగా జీర్ణోద్ధారణ గావిస్తుండటంతో బాలాలయంలో సంబరాలు నిర్వహిస్తున్నారు.మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి భక్తులతో కిట కిట లాడింది. ఎటు చూసినా భక్తులతో భక్తి భావం ఉట్టిపడేలా ముస్తాబు చేసారు..దక్షిణ కైలాసంలో వెలసిన ప్రసన్నవరదరాజ స్వామి ఆలయం మంగళవారం వైకుంఠ ఏకాదశి స ందర్భంగా భక్తులతో కిట కిట లాడింది.శైవ క్షేత్రంలో వెలసిన ఒకే ఒక ఆలయం ప్రసన్న వరదరాస్వామి ఆలయం. ఈ ఆలయం పట్టణ నడిబొడ్డులో ఉంది. ఇఓ డి.బాపిరెడ్డి సూచనలతో ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తుల్లో భక్తి భావం ఉట్టిపడేటట్లు రామసేతు వంతెన నుంచి ఆలయం వరకు నె హ్రూవీధి వరకు చక్కగా విద్యుత్ స్థంభాలకు అరటి చెట్లతో ముస్తాబు చేశారు. కాగా ఉత్తర ద్వార దర్శనంను ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకుఎలాంటి ఇబ్బంది లేకుండా సుదర్శనం కోసం క్యూలైన్లను రూపకల్పన చేశారు. ఉదయం నుంచి భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు.ద్విచక్రవాహనాలతో నెహ్రూవీధి పొడవునా పార్కింగ్‌తో నిండింది. అయితే ఎవరికి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను పోలీసులు నియమంత్రించారు. ఇక వరదరాజస్వామి ఆలయం దారి పూల ముస్తాబులతో సువాసనలతో గుబాళించింది. . కాగా ప్రసన్న వరదరాజస్వామి దర్శనం తరువాత శ్రీదేవి,భూదేవి సమేత వైకుంఠనాథుని భక్తులు మనసారా దర్శించుకున్నారు. వైకుంఠ ద్వారాలి న్ని చక్కగా తీర్చి దిద్దారు. స్వామి అమ్మవార్ల ముస్తాబులు ఇట్టే భక్తుల్ని ఆకట్టుకుంది.ఇక్కడ పూజారి శ్రీనివాసాచార్యులు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాల్ని అందించారు. ఇక పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ప్రసాదాల్ని ఉచితంగా అందించారు.ఆలయ ఇఓ బాపిరెడ్డి సూచనలతో ఆలయ ఇంజనీరింగ్ అధికారులు ఇఇ ఇన్‌చార్జి శ్రీనివాసులు రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## దైవ దర్శనాలతో పులకించిన భక్త కోటి
### -అలరించిన కళ్యాణోత్సవం



చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశిని సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తకోటితో నిండిపోయాయి. స్థానిక రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు వశిష్టాచార్యులచే వివిధ కార్యక్రమాలు జరిగాయి. ఉదయాన్నే ఉత్తరద్వారా దర్శనభాగ్యం కల్పించారు. ఈసేవకు పిల్లారి గోపాలకృష్ణ, నాగరత్నమ్మ, పిల్లారి జీవన్ ప్రకాష్ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదే విధంగా రాత్రి శ్రీవారి కళ్యాణోత్స వానికి రామిరెడ్డి, భ్రమరాంబ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కన్నుల పండుగలా జరిగింది. శక్తిక్షేత్రం బోయకొండ, స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి, ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

## గిరిపుత్రుల్లో పరివర్తన కోసమే గిరిజన వికాసం
చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
గిరిపుత్రుల్లో పరివర్తన తెచ్చి తద్వారా వారిలో సమాజ వికాసం కోసం ప్రభుత్వం గిరిజన వికాసం కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తోందని తేదేపా నాయకుడు జన్నే సుబ్రమణ్యం నాయుడు అన్నారు. మండలంలోని దిగువపల్లి పంచాయతీ ఆర్ఆర్కాలనీలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా వచ్చారు. కాలనీలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేసారు. బాల్య వివాహాలు, చిన్న వయస్సులోనే గర్భవతులైతే కల్గే అనర్థాలను వివరించారు. అదే విధంగా ఆధార్కార్డులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి మోనా, ఎంఇఓ తిరుమలమ్మ, ఐసిడిఎస్ సూపర్ వైజర్ సులోచనా, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పవన్కుమార్, తేదేపా నాయకుడు సోమశేఖర్, స్థానికులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్కాలనీకి తీరిన దాహం-గువ్వల చొరవతో వేసిన బోరు
చౌడేపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
మండలంలోని దిగువపల్లి పంచాయతీ ఆర్ఆర్ కాలనీలో నెలకొనివున్న మంచినీటి సమస్య తీరింది. ఎస్సీ, ఎస్టీలు అధికంగా వున్న గ్రామంలో దశాబ్దకాలంగా మంచినీటి సమస్య నెలకొంది. దీంతో మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్రెడ్డి(చిట్టి) చొరవ తీసుకొని ఎంపిడిఓ లీలామాధవి దృష్టికి తీసుకొచ్చినట్లు బోయకొండ సుబ్బు తెలిపాడు. స్పందించిన ఆమె పంచాయతీ నిధులతో బోరు వేయించింది. బోరులో సమృద్ధిగా నీరు పడటంతో కాలనీ వాసుల ఆనందానికి అవదుల్లేకుండా పోయాయి. యేళ్ళ తరబడి వున్న దాహార్తిని తీర్చిన గువ్వల రమేష్రెడ్డి, బోయకొండ సుబ్బులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తేదేపా నాయకుడు సోమశేఖర్, అధికారులు పాల్గొన్నారు.



## శ్రీవారికి రామచంద్ర యాదవ్చే ప్రత్యేక పూజలు
పుంగనూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త
బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ స్వగృహం నందు వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి నిమిత్తం తన స్వగృహంలోనే పది అడుగుల ఎత్తైన స్వామివారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గత వారం రోజులుగా బ్రహ్మోత్స వాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయాన్నే శ్రీ వెంకటేశ్వర స్వామికి అభిషేకం నిర్వహించి, అలంకరించారు. అర్చకులు ఆధ్వర్యంలో నిత్య ఆరాధనలు, ప్రత్యేక పూజలు ఘనంగా కొనసాగాయి. అనంతరం రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ, స్వగృహంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి వైభవోత్స వాలు నిర్వహించే అవకాశం లభించడం పూర్వజన్మ సుకృతమన్నారు.

## వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
పుంగనూరు రూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త
చలి మంచు కాలంలో వ్యాపించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ రాము అన్నారు. పాలెంపల్లిలో మంగళవారం పిహెచ్సి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని తహసీల్దార్ రాము ప్రారంభించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, వర్షాకాలంలో జ్వరాలు, వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశముందని చెప్పారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పరీక్షలు నిర్వహించి తగిన వైద్యం అందిస్తున్నామని డాక్టర్ తెలిపారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు ఏర్పడకుండా చూడడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని వివరించారు.

## వైకుంఠ నారాయణుని దర్శనం



పుంగనూరు రూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త
వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని శ్రీ కళ్యాణ వేంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం తెల్లవారుజాము నుండి భక్తులకు శ్రీవారు వైకుంఠ ద్వారంలో దర్శనమిచ్చారు. అత్యంత పవిత్రమైన వైకుంఠ ఏకాదశి రోజున స్వామివారిని దర్శించి జన్మ తరింప చేసుకోవడానికి వేలాదిగా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తి చేసి ఉండడంతో రద్దీని సిబ్బంది నివారించగలిగారు. గరుడ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప దర్శనంతో భక్తులు పునీతులయ్యారు.

## కూటమి నేతల సంబరాలు



పుంగనూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త
మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో మంగళవారం కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. పట్టణంలోని గోకుల్ సర్కిల్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మదనపల్లె జిల్లా ఏర్పాటు వల్ల ఈ ప్రాంతానికి పరిపాలనా సౌలభ్యం పెరిగి, అభివృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తా యని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాధవరెడ్డి, విశ్రాంత డిఎస్పి తెలుగుదేశం పార్టీ నాయకుడు సుకుమార్ బాబు, జనసేన జిల్లా ప్రోగ్రాం కమిటీ సభ్యులు చైతన్య రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## యుటి ఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ
కుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త
స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ 2026 సంవత్సర డైరీ, క్యాలండర్లను కుప్పం మండల విద్యాశాఖ అధికారులు కుమారి, రాజారామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శి గాలి సురేష్, యూటీ ఎఫ్కుప్పం మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్సులు రామసుబ్రహ్మణ్యం, నారాయణ స్వామి, గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు శెట్టి, తులసిదాస్, కేశవులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



శాంతిపురం, డిసెంబర్ 30 ప్రభాతవార్త
వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలో పలు ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. ఆలయాల్లో వైకుంఠ ద్వారాలు తెరవడం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు అన్నదానాలు, పందరి భజన వంటి కార్యక్రమాలు చేపట్టారు. మండల పరిధిలోని దండి కుప్పం, రాళ్ళబుదుగురు, కెనమాకనపల్లి, తుమ్మిసి, నడింపల్లి, తిమ్మరాజు పల్లి సమీపంలో పాటుపలు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నల్ల గుండ్రాయి స్వామి క్యాలెండర్ ఆవిష్కరణ
బైరెడ్డిపల్లి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
బైరెడ్డిపల్లి మండలం కడపనత్తం గ్రామంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత నల్ల గుండ్రాయిస్వామి ఆలయం నందు వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మూడు రోజులు కార్యక్రమాలు జరగడం తెలిసిన విషయమే.ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారి వార్షిక క్యాలెండర్ను ఈరోజు బైరెడ్డిపల్లి మండల తెలుగుదేశం అధ్యక్షులు కిషోర్ గౌడ్ వారి సతీమణి రాధా కిషోర్ ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించడం జరిగినది.ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ స్వామివారి ఉత్స వాలను ఘనంగా ఏర్పాటు చేసినటువంటి ధర్మకర్తలు మురళి స్వామి,రామకృష్ణాచార్యులు, తదితర ఆలయ కమిటీ సభ్యులు, ఎంతో గొప్పగా చేశారని,అన్నదాన కార్యక్రమం కూడా సజావుగా సాగుతున్నదని,ప్రతి సంవత్సరం ఇదే విధంగా స్వామివారి ఉత్స వాలను జరుపుకుంటున్నామన్నారు.

## పట్టణ పరిశుభ్రతకు అందరూ సహకరించాలి - కమీషనర్



కుప్పం, డిసె ంబర్ 30 ప్రభాతవార్త
కుప్పం పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు కోరారు.మంగళవారం రాత్రి ఆయన పట్టణంలో కార్మికులు చేపట్టిన పారిశుధ్య పనులను దగ్గరుండి పరిశీలించారు. ఈసందర్భంగా దుకాణదారులు, ప్రజలతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పాన్ని స్వచ్ఛ మున్సిపాలిటీ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. రోజులో పగలు, రాత్రి రెండుపూటలా పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. దుకాణదారులు, ప్రజలు కూడా చెత్తను మున్సిపల్ కార్మికులకు నేరుగా అందించాలని కోరారు.

## బడుగులకు అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్సీ కంచర్ల



కుప్పం, డిసె ంబర్ 30 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల వారికి అండగా నిలుస్తోందని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో ప్రభుత్వ విప్డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్సురేష్బాబు మీడియా సమావేశంలో ప్రసంగించారు. డా॥ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. తల్లికివందనంకు 10090కోట్లు, అన్నదాత సుఖీభవకు 6310, దీపం2లో 2684కోట్లు, పెన్షన్లకు 50వేలకోట్లు, ఇఆటో డ్రైవర్లకు 436కోట్లు, స్త్రీశక్తి పథకంలో ఉచిత బస్సుకు 1144కోట్లు,మైనార్టీ సంక్షేమంకు 3670కోట్లు ఖర్చు చేశారన్నారు. కుప్పంలో ప్రకటించిన విధంగా మెగా డిఎస్సీ2025 నిర్వహించి 16వేలకు పైగా టీచర్ల పోస్టులు భర్తీ చేశారన్నారు. అలాగే ఐదు వేల కానిస్టేబుల్ ఉద్యోగాలు కల్పించారన్నారు. వైఎస్సార్సీ అభివృద్ధికి అడ్డుపడితే తాము కూడా ధీటుగా సమాధానం చెబుతామన్నారు. గత వైఎస్సార్సీ పాలనలో పరిశ్రమలు పారిపోయాయని పాలన కూడా విధ్వంసాలతో సాగిందని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న అన్నివర్గాల ప్రజలకు సిఎం చంద్రబాబు న్యాయం చేస్తూ అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. సమావేశంలో కార్పోరేషన్ ఛైర్మన్ రాజశేఖర్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, పార్టీ అధ్యక్షులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్,సుబ్బు,వెంకటరమణ, నేతలు రామచంద్ర,సతీష్, సుగుణమ్మ, వసంతమ్మ,కౌన్సిలర్లు జిమ్దాము,జాకీర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## అరగొండలో ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు
తవణంపల్లె, డిసెంబర్ 30 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి పండుగ పర్వదినం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీసీతా లక్ష్మణ సమేత కోదండరాములుస్వాముల వారి మూలవిరాట్కు ఉదయం ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను ఉత్తర దిక్కుకు అభిముఖంగా అధిరోహింపజేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం భాగ్యం కల్పించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ దర్శనార్థం వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది.సాయంత్రం సత్యనారాయణ వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు.అలాగే మండలంలోని తవణంపల్లె శ్రీకోదండరాములు స్వామి ఆలయం, టి.పుత్తూరు శ్రీకోదండరామస్వామి ఆలయంలో కూడా వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఐరాలలో...
ఐరాల, డిసెంబర్ 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి వేడుకలను మంగళవారం మండలంలో వైభవోపేతంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని పొలకల గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు స్వామి,అమ్మవార్లను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహజంచిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం : అర్డీఓ శ్రీనివాసులు
గుడిపాల, డిసెంబర్ 30 ప్రభాతవార్త:



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చిత్తూరు అర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎఎల్ పురం గ్రామంలో మంగళవారం జరిగిన గిరిజన వికాస్ కార్యక్రమానికి అర్డీఓ శ్రీనివాసులు హాజరై బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ బాలికలు వివాహ వయస్సు రాకముందు పెళ్ళి చేయడం వల్ల వారు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతారని, బాల్య వివాహాల అడ్డుకట్టకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలన్నారు. సిడిపిఓ శ్యామ్ సుగుణ కుమారి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో బాల్య వివాహాలపై అవగాహన వుంటే తల్లిదండ్రులు ఎవ్వరు తమ చిన్న పిల్లలకు పెళ్ళి చేయరన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు శ్రీనివాసులు, ఎంపిడిఓ శిరీష, ఎస్ఐ రామ్మోహన్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లలిత, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత
గుడిపాల, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
తమిళనాడు రాష్ట్రం నుండి అక్రమంగా గుడిపాల మండలానికి తరలివస్తున్న రేషన్ బియ్యంను మంగళవారం ఎస్ఐ రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడు నుండి మండలానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలివస్తుందని సమాచారం అందడంతో ఎస్ఐ రామ్మోహన్ సిబ్బందితో కలిసి బెంగళూరు-చెన్నై ఎక్స్ప్రెస్ హైవే రెడ్డిగుంట ఫ్లైఓవర్ వద్ద కాపుకాశారు. ఈ క్రమంలో కమ్మతిమ్మపల్లి వైపు నుండి ఒక ద్విచక్ర వాహనంలో ఓ వ్యక్తి రెండు పెద్ద సంచులతో వస్తుండటంతో ఆ వాహనంను నిలుపదల చేసి తనిఖీ చేశారు. మాపాక్షికి చెందిన ఆరుణ్(45) తమిళనాడు నుండి రెండు సంచుల రేషన్ బియ్యంను తీసుకువస్తుండటంతో అతనిని పట్టుకుని బియ్యంను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## ప్రైవేటు ఫైనాన్స్ వేధింపులు -యువకుడు ఆత్మహత్య
యాదమరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
ప్రైవేటు ఫైనాన్స్ వడ్డీ వేధింపులకు యాదమరి మండలంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రైవేటు ఫైనాన్స్ వడ్డీ వ్యాపారులు ఇచ్చిన డబ్బులు చెల్లించాలని అనునిత్యం వేధిస్తుండటంతో జంగాలపల్లి పంచాయతీ ఎంఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన ఢిల్లీబాబు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఈశ్వరయ్య వెల్లడించిన వివరాల మేరకు ఢిల్లీబాబు ఇంటి నిర్మాణం కోసం ఓ ప్రైవేటు ఫైనాన్స్లో రూ.4.65 లక్షల రుణం తీసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, ప్రతి నెల కట్టాల్సిక వాయిదాలను ఢిల్లీబాబు ప్రైవేటు ఫైనాన్స్ వారికి చెల్లించకపోవడంతో వారు ఢిల్లీబాబు ఇంటికి వచ్చి వేధించడమే కాకుండా కోర్టులో ఢిల్లీబాబు, అతని భార్యపై కేసులు దాఖలు చేసి నాన్ బెయిలబుల్ వారెంట్ తీసుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఢిల్లీబాబు ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఢిల్లీబాబు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాఠశాలల అభివృద్ధి సహకారం
పెనుమూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
మండల పరిధిలోని పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని మాజీ ఎంపిపి షణ్ముగవర్మ అన్నారు. మండలంలోని చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి వి.అల్లమ్మ ఒక గోద్రెజ్ బీరువా, పది కుర్చీలను విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపిపి మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలల్లో కనీస వసతులు లేవని అలాంటి పాఠశాలలను దాతలు ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం పాఠశాలకు అభివృద్ధి నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ విద్యార్థులకు అవసరమైన మేరకు వసతులు లేకపోతున్నాయన్నారు. విద్యార్థులు పుస్తకాలు, దుస్తులు, వారు కూర్చొవడానికి డెస్కులు, కంప్యూటర్లు, సైకిళ్ళు తదితరాలను దాతలు సమకూర్చితే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా తయారు చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు రాజేంద్రన్, భాస్కర్నాయుడులు, మాజీ ఎంపిటీసీ గోపాల్నాయుడు, హెడ్మాస్టర్ ధనంజయరెడ్డి, ఉపాధ్యాయుడు విజయ్, అంగన్వాడీ టీచర్ అరుణ, స్థానిక నాయకులు కిషోర్, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ట్రెండ్ మార్పు : ఎమ్మెల్యే అమరనాథరెడ్డి
పలమనేరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వంతో రాష్ట్ర ట్రెండ్ మారిందని, ఈ ఏడాదిలో కూటమి ప్రభుత్వం గొప్ప విజయాలు సాధించి దేశంలోని ఇతర రాష్ట్రాలకు మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. 2025 సంవత్సరంలో కూటమి విజయాలపై మంగళవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వందే అన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, ఆటో డ్రైవర్ల సేవలో, మెగా డిఎస్సీ, కానిస్టేబుల్ పోస్టుల నియామకం తదితరాలను కూటమి ప్రభుత్వం ద్విగ్విజయంగా పూర్తి చేసిందన్నారు. రానున్న సంవత్సరంలో సైతం రాష్ట్రం గొప్ప విజయాలు సాధించనుందన్నారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి పండుగ



రామకుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త
మండలంలో వైకుంఠ ఏకాదశి పండగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విజలాపురంలోని శ్రీ వేణుగోపాలస్వామి, రామకుప్పంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోవిందనామస్మరణ చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. రాత్రిదాకా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.




## ఎరువుల దుకాణాల్లో అధికారుల తనిఖీ
పెద్దపంజాణి, డిసెంబర్ 30 ప్రభాతవార్త
మండలంలోని ఎరువుల దుకాణాల్లో మంగళవారం స్పెషలాఫీసర్, ఎడిఎ సాలురెడ్డి, ఎఒలుసునీల్రెడ్డి, హేమలత ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ దుకాణంలో రికార్డులు, ధరల పట్టికలు పరిశీలించారు. రైతులకు నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. రైతులకు అవసరం ఉన్న ఎరువులనే విక్రయించడంతో పాటు ఇతర ఎరువులు అంటకట్టరాదని సూచించారు.

# చిత్తూరు డివిజన్
చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## శ్రీవారి సేవలో ఎమ్మెల్యే గురజాల
చిత్తూరురూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ కుటుంబసమేతంగా తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకొన్నారు. మంగళవారం ఉదయం విరామసమయంలో కుటుంబసభ్యులతో కలసి శ్రీవారిని దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశికి తితిదే అద్భుతమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వైకుంఠద్వార దర్శన ఉత్సవాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆలయంలో జరుగుతున్న హోమాధి కార్యక్రమాల్లో పాల్గొని, వైకుంఠద్వారం గుండా శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో పలమనేరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు అమర్నాధరెడ్డి, కె.మురళీమోహన్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 5 రోజుల పనిదినాలు కోరుతూ బ్యాంకు ఉద్యోగుల నిరసన
చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త:



బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు హైరోడ్డులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల యూనియన్ నాయకులు మాట్లాడుతూ వారంలో బ్యాంకులకు శని, ఆదివారాలు మినహాయించి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని, డిజిటలైజేషన్ వల్ల కస్టమర్స్ 24/7 డిజిటల్ చానల్స్ పెరుగుతాయని, బ్యాంకు ఉద్యోగులకు తీవ్ర పని ఒత్తిడి వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పరిసర ప్రాంతాల్లో వున్న బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



బంగారుపాళ్యం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి వేడుకలను మంగళవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మొగిలి వెంకటగిరిలో వెలసిన శ్రీకోదండరామాలయంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను వివిధ పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి శిరీష్రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ ప్రకాష్, టివి రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే నలగాంపల్లి దేవరకొండపై వెలసిన శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరం ద్వారం ద్వారా స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఉచితంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## జిల్లాస్థాయి వ్యాసరచనపోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు
చిత్తూరురూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త:



భగవాన్ శ్రీసత్యసాయి బాబా శతవర్ష జన్మదినోత్స వ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసినట్లు సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు మధుసూదనం తెలిపారు. సంతపేట, శ్రీవాణి విద్యాలయ హైస్కూల్ విద్యార్థిని జి.లక్ష్మీప్రియ 'డ్యూటీ ఈజ్ గాడ్' అనే అంశంపై రాసిన వ్యాసం జిల్లాస్థాయిలో ఉత్తమం కావడంతో ప్రశంసాపత్రంను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదనంతో పాటు పాఠశాల కరస్పాండెంట్ రమణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజనులు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి
తవణంపల్లె, డిసెంబర్ 30 ప్రభాతవార్త:
గిరిజనులు ప్రభుత్వ గిరిజన వికాసం కార్యక్రమం అమలులో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వర చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని మాధవంర గ్రామ పంచాయతీ స్వస్థిక్నగర్ ఎస్టీ కాలనీలో గిరిజనవికాసం కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిభిరాన్ని నిర్వహించారు.ఈకార్యమ్రానికి ప్రారంభించిన వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ గిరిజనులు ప్రతి ఒక్కరూ ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్వేలు, సూపర్వైజర్ రాజశేఖర్, కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్పీలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంకు సహకరించాలి : డిఎస్పీ
కుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త



ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా ప్రజలు శాంతియుత వాతావరణంకు సహకరించి వేడుకలు జరుపుకోవాలని కుప్పం డిఎస్పీ పార్థసారథి సూచించారు. డిసెంబర్ 31నాడు రాత్రి ఎవరైనా ఆకతాయిల మద్యం తాగి వాహనాలు నడపడం, రోడ్లపై కేక్ కటింగ్లు వంటి అసాంఘీక కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే అనుమతులులేకుండా రెస్టారెంట్లు, హోటళ్ల వద్ద ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. 31న సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు పోలీసులు రోడ్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. ప్రజలు కూడా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కుప్పం అర్బన్ సిఐ శంకరయ్య పాల్గొన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో కెడిసి విద్యార్థుల ప్రతిభ
కుప్పం, డిసెంబర్ 30 ప్రభాతవార్త



తిరుపతి ఎస్వీయు విడుదల చేసిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కుప్పండిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు కాలేజ్ ఛైర్పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. బిసిఎలో ఉష 9.41పాయింట్లు, కావ్యశ్రీ 9.31, బికాం (సిఎ)లో దివ్య 8.96, శ్వేత 8.94, బిఎస్సీ (సిఎస్)లో లోకేష్ 8.36, పూర్ణిమ 9.26, బిబిఎలో ఇందుశ్రీ 8.03, పవిత్ర 7.93, బిఎస్సీ కెమిస్ట్రీలో నవిత 7.34, పళని 7.06పాయింట్లతో కళాశాల టాపర్లుగా నిలిచారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్పర్సన్ శాంత నాగరాజ్, వైస్ ఛైర్మన్ సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.



## ఘనంగా వైకుంఠ ఏకాదశి పండగ
కుప్పం,డిసెంబర్ 30 ప్రభాతవార్త
కుప్పంలో ప్రజలు వైకు ంఠ ఏకాదశి పండగనుఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, చప్పిడిగరుగులు వద్ద గల శ్రీ రంగనాథస్వామి ఆలయాల్లో వైకు ంఠ ద్వార దర్శనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే శ్రీ బేటరాయస్వామి ఆలయంలో సైతంవిశేష పూజలు జరిపారు.

**గుడుపల్లె :** మండలంలో ప్రజలు వైకుంఠ ఏకాదశి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కనమనపల్లిలోని శ్రీ శ్రీనివాసస్వామి ఆలయంలో భక్తులకు వైకుంఠ వాకిలి దర్శనంను నిర్వాహకులు కల్పించారు. అలాగే మల్లప్పకొండ శ్రీ మల్లేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు.

## ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోండి : సిఐ
పాలసముద్రం, డిసెంబర్ 30 ప్రభాతవార్త



సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ నూతన సంవత్సరం 2026ను బాధ్యతాయుతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా సర్కిల్ పరిధిలో కొన్ని ఆంక్షలు, భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. సర్కిల్ పరిధిలో నిర్ణీత సమయానికి హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్లు, ఇతర వాణిజ్య సంస్థలు మూసివేయబడతాయి. సర్కిల్ పరి ధిలోని ముఖ్యపట్టణాలు,రహదారులపై ప్రత్యేకపోలీస్ బృందాలతోవిస్తృత తనిఖీలు నిర్వహిస్తామన్నారు.



## నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు తప్పవు
పాలసముద్రం, డిసెంబర్ 30 (ప్రభాతవార్త)
మండలంలోని ప్రజలు నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని స్థానిక ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో బహిరంగ ప్రదేశాల్లో కేకులు కట్చేయడం, బాణసంచాకాల్చడం, బైక్రైడింగ్చేయడం వంటివిచేస్తే కేసులుతప్పవని హెచ్చరించారు.

# తిరుపతి డివిజన్

## భక్తులకు అన్నదానం

విజయపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: మండలంలోని కొత్త ఇళ్ళత్తూరు గ్రామంలో బ్రహ్మంగారి గుడి వద్ద వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిపతిరాజు, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిహస్కర్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, కోసలనగరం పీఏసీఎస్ డైరెక్టర్ వరదరాజులు, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరుని సేవలో భక్తులు



శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఊరందూరు పరిసర గ్రామాల్లోంచి భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చారు. ఉదయం స్వామి అమ్మవార్లను గ్రామోత్సవం నిర్వహించారు.

## వాయులింగేశ్వరుని దర్శనం కోసం వివిపిల తహ తహ



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: ముక్కోటి ఏకాదశి సందర్భంగా దక్షిణ కైలాసంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరుని సన్నిధి అతిధులతో కళ కళలాడింది. రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ కుటుంబ సమేతంగా స్వయం భువుని దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి వారి సిబ్బంది వేదపండితులతో స్వాగతం పలికారు. ఆయన ఆలయంలో స్వామి అమ్మవార్ల దర్శనంతో పాటు భక్తులతో మమేకమయ్యారు. మంగళవారం స్వామిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు,బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు ప్రస్తుత ఎంఎల్సి సోమూ వీర్రాజు,శాసనసభ్యులు (మాచర్ల) జూలుగంట బ్రహ్మానందరెడ్డి, తణుకు ఎంఎల్ఏ రాధాకృష్ణ, శ్రీకాకుళం ఎంఎల్సి రామారావు,తెలంగాణ గవర్నర్ సతీమణి సుదదేవవర్మ, ఐఏఎస్ అధికారి సత్యనారాయణ,జ్యూడిషియల్ శాఖకు చెందిన జడ్జిలు హైకోర్టు చీఫ్ జస్టిస్ (మద్రాస్) మణీంద్ర మోహన్ శ్రీ వాత్సవ్‌లు దర్శించుకున్నారు.వారికి దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ మోహన్, ఎపిఆర్ఓ రవి,స్థానిక ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాస్ నాయక్ పర్యవేక్షించారు.

## దర్శనానికి పోటెత్తిన భక్త జనం



ఏర్పేడు,డిసెంబర్ 30 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని సంపద సంతాన వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా పోటెత్తారు. ఇక్కడ సుమారు 15 సంవత్సరాల క్రితం జనసేన నాయకుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఇక్కడ భక్తులు స్వామిని దర్శించుకుంటూ వరాలు పొందుతూ మొక్కులు తీర్చుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువజాము నుంచే భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏడు ద్వారాలు ఏర్పాటు చేసారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ స్వామి దర్శనంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు.

## వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు కిటకిట



కార్వేటినగరం,డిసెంబరు 30 ప్రభాతవార్త: తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సంధర్భంగా భక్తులు కిటకిటలాడారు. ఆలయాన్ని పువ్వులు, విద్యుద్దీపాలతో వైకుంఠ ఏకాదశినాడు ఉత్తరద్వార దర్శనం చేసుకుంటే మంచి కలుగుతుందనే నానుడితో మంగళవారం తెల్లవవారి జామున నుండి భక్తులు బారులు తీరారు. అలాగే కుమరిగిరి గుట్టపై వెలసియున్న శ్రీవళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యంస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సంధర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు అందించారు.కార్యక్రమంలో టిటిడి ఆలయ ఇన్స్‌పెక్టర్ సురేష్,అర్చకులు పాల్గొన్నారు.

## కేవీబీ పురంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



కేవీబీ పురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: కేవీబీ పురం, మండలంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాట్రపల్లి శ్రీదేవి భూదేవి వైకుంఠనాథస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం నుంచే ఆలయ ఉభయదారులు స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించి ఆలయంలో ఉత్తర ద్వారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం బోర్డు మెంబరు విశాలక్ష్మి, జిల్లా బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్య ంరెడ్డి, రాష్ట్ర బీజేపీ అధికార పక్ష నాయకుడు శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్టు బోర్డు ఛైర్మన్ కోలా ఆనంద్, ఆలయ కమిటీ నాయకురాలు శ్రీకాళహస్తి ట్రస్టు బోర్డు మెంబరు విశాలాక్షి ఆనంద్, గవర్ల కృష్ణయ్య, సర్పంచ్ సురేంద్ర, మండల ఎంపీపీ మునిలక్ష్మి నందకుమార్, బాబుయాదవ్, వెంకటముని యాదవ్, సుజాత, సురేంద్ర, మునెయ్య, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి



నాగలాపురం, డిసెంబరు 30 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని శ్రీ వేదవల్లి సమేత శ్రీ వేదనారాయణస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేదనారాయణ స్వామి ఆశీస్సులను పొందడం జరిగింది. వేదనారాయణ స్వామి ఆలయం బాలయణంలో ఉన్నందు వలన మూలవిరాట్ దర్శనం లేకపోవడంతో ఉత్సవ మూర్తులకు దర్శించుకుని నిరుత్సాహంతో భక్తులు వెళ్ళడం జరిగింది. గత మూడు సంవత్సరాలుగా శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయం పునర్నిర్మాణ పనుల్లో జాప్యం కావడంతో మూల విరాట్ దర్శనం భక్తులకు దూరమైనందు వలన, వైకుంఠ ఏకాదశి సర్వదినాన నిరుత్సాహం చెందుతున్నారు. తొందరగా బాలాయను పూర్తిచేసుకుని వేదనారాయణ స్వామి దర్శనభాగ్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

## పుత్తూరులో వైకుంఠ ఏకాదశి పూజలు

పుత్తూరు రూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల్లో మంగళవారం వైకుంఠ ఏకాదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయం బజారు వీధిలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం, శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయాల్లో వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. సదాశివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గీతామందిరంలో శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజలు చేశారు. శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేశారు.

## బ్రాహ్మణ సంక్షేమ సేవాసమైక్య సంఘానికి అపూర్వ గౌరవం

పుత్తూరు రూరల్, డిసెంబరు 30 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్యలో తిరుపతి జిల్లా పుత్తూరు గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సమాఖ్య సంఘానికి అపూర్వ గౌరవం దక్కింది. ఈ సంఘంలో ముగ్గురు సభ్యులకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం పట్ల తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి బాలాజీశర్మ, సంయుక్త కార్యదర్శి బాలాజీరావు పుత్తూరు గౌరవం పెరిగిందని తెలియజేశారు. తిరుపతిలోని సూళ్లూరుపేటలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గాయత్రీ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం గౌరవ సలహాదారు అలూరి రామకృష్ణని తిరుపతి జిల్లా తరపున రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోవడం జరిగిందని, పుత్తూరు బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వర ప్రసాద్‌కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేదం హరిప్రసాద్ కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీసిటీలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



సత్యవేడు, డిసెంబరు 30 ప్రభాతవార్త: శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, హరినామ స్మరణతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంలో పరవశించాయి. అనంతరం విష్ణు సహస్రనామ జపం, గణపతి, నవగ్రహ, సుదర్శన హోమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో శ్రీసిటీసీ ఎఫ్‌వో నాగరాజన్, అకౌంట్స్ హెడ్ జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీసిటీ ఉద్యోగులు, పరిసర గ్రామాలు, సూళ్లూరుపేట నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీసిటీ ప్రతినిధులు పి.బి.శాస్త్రి, పల్లెటి బాలాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# తొండమాన్ వెంకటేశ్వరుని సన్నిధిలో భక్తుల సందడి

తొండమనాడు ఆలయంలో వివిపిలు



శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: మండలంలోని తొండమాన్ పురంలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళ వారం అతిధుల తాకిడి పెరిగింది. అతిధులకు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లును టిటిడి అధికారులు పర్యవేక్షించారు. మంగళవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేర్వేరుగా దర్శించుకున్నారు.ముందుగా మాజీ ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి సతీమణి బియ్యపు వాణి, కుమార్తె పవిత్రారెడ్డి, ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు.వారికి మండల సీనియం నాయకులు బర్రెసుదర్శనం రెడ్డి, జయచంద్రారెడ్డి, నారాయణ,భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేష్,సుబ్బానాయుడు, కండ్రిగ వేణు, జయకృష్ణారెడ్డి, బలరాం, చెంగల్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులతో కిట కిట లాడింది. ఇక్కడ స్వామి ప్రసన్నవదనుడై, కూర్చొని భక్తులకు దర్శన మిస్తున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. పూల సొబగులతో ముస్తాబు చేసారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భక్తుల తాకిడి గణనీయంగా పెరిగింది. టిటిడి చక్కటి ఏర్పాట్లు చేసారు. ఇక్కడ ఏర్పాట్లును డెప్యూటీ ఇఒ నాగరత్నమ్మ, సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సుధీర్,మహేష్‌లు పర్యవేక్షించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్ఐ వెంకటేష్ సారధ్యంలో బందోబస్తు ఏర్పాటు చేసి క్యూలైన్లు పర్యవేక్షించారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర వైకుంఠద్వారం



తిరుపతిరవాణ,డిసెంబర్ 30ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుపతి కొత్త వీధిలోని పురాతన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ఉదయమే పురోహితులు స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి ,భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ప్రతి మనిషి భక్తి భావంతో కూడిన సేవా ధర్మాన్ని పాటించాలని రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, తాతయ్యగుంట గంగమ్మగుడి ఛైర్మన్ మహేష్ యాదవ్‌లు అన్నారు. స్వామివారి దర్శనం అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలు నిరంతరం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం ఛైర్మన్ గుండాల గోపీనాథ్, తాతయ్యకుంట గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్‌యాదవ్, రంగస్థలం ప్రతినిధులు కేవీన్‌రాజా, పురోహితుడు సురేష్ స్వామి, ప్రభాకర్ నాయుడు, కొట్టే సుబ్రహ్మణ్యంరెడ్డి, మనోజ్, కిరణ్ తొండమునాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా పెక్లీలు

తిరుపతిరూరల్, డిసెంబర్ 30 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రాజ్యాంగ నిర్మాత, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి 'డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా కొందరు టిడిపి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు పేరిట పెక్లీలే ఏర్పాటు చేయడం వివాదస్పదంగా మారింది. అంబేద్కర్ విగ్రహం పూర్తిగా కనిపించకుండా పెక్లీలు అడ్డుగా పెట్టడం పట్ల 'స్థానిక దళిత నాయకులు, అంబేద్కర్ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా పెట్టిన పెక్లీలను తక్షణమే తొలగించి, విగ్రహానికి గౌరవం దక్కేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## అన్నా క్యాంటీన్లు పరిశుభ్రంగా ఉంచండి: కమిషనర్

తిరుపతిరవాణ,డిసెంబర్ 30ప్రభాతవార్త: తిరపతి నగరంలోని అన్న కాంటీన్లను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ఈ ఎస్ ఐ హాస్పిటల్ వద్ద గల అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్లు ఎన్ని ఇచ్చారు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఒక్కొక్కరికి టోకెన్లు ఇవ్వాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

## శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో వైకుంఠ వాకిలి ప్రవేశం



చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: చంద్రగిరిలోని టిటిడి అనుబంధ శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో భక్తులు వైకుంఠ వాకిలి ప్రవేశంతో ధన్యత పొందారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఏకశిలపై వెలసియున్న శ్రీసీతా కోదండరామస్వామి లక్ష్మణ భరత శత్రఘ్నులు హనుమంత స్వాముల వారిని మంగళవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ టి.మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాస భట్టార్, పరిచారిక రామాచార్యులు, సిబ్బంది బెల్లంకొండ ప్రసాద్, రామకృష్ణ, తమ సేవలందించారు.

## డీలర్లతో రైతులకు ఇబ్బందులెదురైతే ఫిర్యాదు చేయండి..!

చంద్రగిరి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని రైతులకు ఎరువుల విషయంలో డీలర్ల వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమకు ఫిర్యాదు చేయాలని ఏఓ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఎరువుల పంపిణీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండల పరిధిలో రైతులు 200 ఎకరాలలో మాత్రమే వరి సాగు చేస్తున్నారనీ, 10 ఎకరాల్లో మాత్రమే వేరుశెనగ సాగు చేస్తున్నట్లు వివరించారు. అవాస్తవమైన ఎవరి మాటలు వినవద్దనీ, ఆ మేరకు ఎవరైనా రైతుల్లో అవాస్తవాలు సృష్టించేందుకు యత్నించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చెస్‌లో మెడల్స్, నగదు బహుమతులు



తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 30 ప్రభాతవార్త:ఆల్ చిత్తూర్ చేస్ అసోసియేషన్ వారు చిత్తూర్ లో నిర్వహించిన టోర్నమెట్ నందు తిరుపతి ఎడిఫై పాఠశాల నందు చదువుతున్న కాకర్ల దియన్షిక, కాకర్ల నిర్వన్ కార్తికేయ ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించారు వారికి చేస్ అసోసియేషన్ వారు అభినందించి మెడల్ క్యాష్ ప్రైజ్ తో సత్కరించి మరెన్నో మెడల్స్ క్యాష్ ప్రైజులు అందుకోవాలని వారు ఆకాంక్షి ంచారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు కృషి చేద్దాం

రేణిగుంట డిసెంబర్ 29 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తానని రేణిగుంట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు నెల్లూరు సుబ్రహ్మణ్యం అన్నారు. రేణిగుంట మండలం గురవరాజు పల్లె గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలం నందు అంబేద్కర్ భవన నిర్మాణానికి నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా నెల్లూరు సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షులుగా నాగేశం, గౌరవ సలహాదారుగా డాక్టర్ గౌరీ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ ఐజయ్య, జనరల్ సెక్రటరీగా జూలియన్ రాజు, కోశాధికారిగా ప్రతాప్ కుమార్, ఉపాధ్యక్షులుగా మునిరత్నం, చలపతి, నరేష్, వరలక్ష్మి దేవి మోహన్, సహాయ కార్యదర్శులుగా సెల్వరాజ్, బాబు మేస్త్రి, గంగాధరం, రాజేంద్ర, ఫణి భూషణ్, కమిటీ సభ్యులుగా రంగయ్య, లక్షి , ఇన్బానాధన్, కృష్ణమూర్తి, నాగార్జున, చైతన్య, సాగర్, లక్షీ నారాయణ, పురుషోత్తం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కరాటేలో శ్రీ చైతన్య ప్రభంజనం

రేణిగుంట డిసెంబర్ 30 ప్రభాతవార్త: రేణిగుంట పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు కరాటేలో అత్యంత ప్రతిభ సాధించి మూడు బహుమతు లను కైవసం చేసుకుని అందరి మన్ననలు పొందుతున్నారు. పాఠశాలలోని ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి చైతన్య మొదటి బహుమతి, తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి రంజిత్ రెండవ బహుమతి, ఐదో తరగతి చదువుతున్న పూర్ణ సాయి మొదటి బహుమతి జిల్లా స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో అందుకున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ఏజీఎం సురేష్, పాఠశాల ప్రిన్సిపల్ చారుమతి, డీన్ గోవర్ధన్, ప్రైమరీ తరగతుల ఇన్చార్జి భాగ్యశ్రీ, కోచ్ సుందరం పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు.

## రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



రేణిగుంట,డిసెంబర్ 30 ప్రభాతవార్త: రేణిగుంట మండలం ఎస్ఆర్ పట్టెడ వద్ద రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. స్వర్ణముఖి నది నుండి ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను తాహసిల్దార్ గుర్తించి వెంటనే రికార్డులను పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు నిర్ధారించి వెంటనే వాటిని సీజ్ చేశారు.

## శ్రీ వియంసి చారిటబుల్ ట్రస్ట్‌చే అన్నదాన కార్యక్రమం



తిరుచానూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: తిరుచానూరు వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరులో శ్రీవియంసి చారిటబుల్ ట్రస్ట్. ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అన్న ప్రసాదాన్ని స్వీకరించి సంతోషం వ్యక్తం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం తిరుచానూరులో అమ్మవారి ఆలయం వద్ద తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకి చెందిన నాళం కళ్యాణ్ అతని కుటుంబ సభ్యులు,వియంసి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుచానూరు డిసెంబర్ 30 ప్రభాతవార్త: శిల్పారామం, తిరుపతి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించబడే నూతన సంవత్సర వేడుకలు -2026ను ఈ సంవత్సరం జనవరి 1వ తేదీన ఘనంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాలలో భాగంగా కోటి ఈవెంట్స్ ఐకాన్స్, డ్యాన్స్ షో సీజన్-2 వారి ఆధ్వర్యంలో జబర్దస్త్ కమెడియన్ రాజమోళి గారి కామెడీ స్కిట్స్, జూనియర్ బాలకృష్ణ, జూనియర్ కృష్ణ ప్రదర్శనలు, లైవ్ మ్యూజిక్ కాన్సెప్ట్, ప్రత్యేక క్లాసికల్ నృత్యాలు, మ్యాజిక్ షో, రేజు ఈవెంట్స్ ప్రదర్శనలు, హరిత మేడం ప్రత్యేక ప్రదర్శనతో పాటు కోటి ఈవెంట్స్ టీమ్ వారి ఆకట్టుకునే కార్యక్రమాలు వేదికపై అలరించనున్నాయి. తిరుపతి ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని శిల్పారామం అధికారులుబి. సుధాకర్ ఎ.వో,కె. ఖాదర్ వల్లి , ఎ.వో కల్చరల్ కోరారు.

## గుత్తా కీర్తికి పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రధానం



తిరుపతి విద్య,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని గుత్తా కీర్తికి పీహెచ్‌డీ డాక్టరేట్‌ను మంజూరు చేశారు. ఆచార్య పీ.వీ. నరసయ్య పర్యవేక్షణ మార్గదర్శకంలో "ఇంపాక్ట్ ఆఫ్ వర్కింగ్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ఆన్ ప్రాఫిటబిలిటీ ఇన్ సెలెక్ట్ ఎఫ్ఎంసీజీ కంపెనీస్ ఇన్ ఇండియా" అనే విషయంపై పరిశోధనకు గాను గుత్తా కీర్తికి పీహెచ్‌డీ మంజూరు అయ్యిందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య బి.రాజమాణిక్యం తెలియజేశారు. ఈ సందర్భంగా వాణిజ్య శాస్త్ర విభాగానికి చెందిన ఆచార్యులు,పరిశోధక విద్యార్థులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

## ఎస్వీయులో ఘనంగా ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ వేడుకలు

తిరుపతి విద్య,డిసెంబర్ 30 ప్రభాతవార్త: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఏర్పడి 55 వసంతాలు పూర్తి చేసుకుని 56వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా ఎస్ వి యూ ప్రకాశం భవనం ఎదుట ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించి, కేకులు కోసి విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు మాతేశ్వరి స్వాతంత్రం, ప్రజాస్వామ్యం,సోషలిజం అనే అక్షరాలతో కూడిన ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ తేజ,రెడ్డి కుమార్,యూనివర్సిటీ గర్ల్స్ కన్వీనర్ లక్షి , నాయకులు తిరుమలేష్, చక్రి, మేఘన,పవన్, అనురాధ, మంజుల, సింధు, షేక్షావలి తదితరులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## రిమ్స్‌లో ముగిసిన గ్యాబ్ ఫేస్ట్ 2కే25



తిరుపతి విద్య,డిసెంబర్ 30 ప్రభాతవార్త: స్థానిక భైరాగి పట్టెడ లోని కొండారెడ్డి రాయలసీమ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు రెండు రోజులు నిర్వహించిన గ్యాబ్ ఫేస్ట్ 2కే25 మంగళవారంతో ముగిసింది. ఇందులో యంగ్ మేనేజర్‌గా వర్ష, మార్కెటింగ్ మంత్రలో రవిశంకర్ రెడ్డి,అమర్, సూర్య,జశ్వంత్,ఫైనాన్స్ గేమ్ లో వినోద్,పేపర్ ప్రజెంటేషన్‌లో భరత్ నాయక్, బిజినెస్ క్విజ్‌లో వర్ష, జశ్వంత్, రవిశంకర్ రోల్‌ప్లేలో సాయి జ్యోతి విజేతగా నిలిచారు.కళాశాల యజమాన్యం వై.కొండారెడ్డి, ఆనందరెడ్డి,విజయ్‌రెడ్డి విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## రాష్ట్ర క్రికెట్ జట్టుకి ఎంపికైన ఎమరాల్డ్స్ విద్యార్థిని



తిరుపతి విద్య,డిసెంబర్ 30 ప్రభాతవార్త: ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన 69 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రికెట్ పోటీలలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన ఎమరాల్డ్కళాశాల ఇంటర్ విద్యార్థిని రుక్సర్ తబుస్సుం అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టులో స్థానం సాధించి నట్లు కళాశాల డైరెక్టర్లు గిరిదర్, విశ్వనాథ్‌లు తెలియజేశారు. జిల్లా స్థాయి పోటీలలో డబుల్ హ్యాట్రిక్ కూడ సాధించిన రుక్సర్‌ను వారు అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీలలో కూడ విశేషంగా రాణించాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమలో అసిస్టెంట్ డైరెక్టర్లు మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాదమునిలు పాల్గొన్నారు.

## ఎస్‌డిహెచ్ ఆర్ విద్యార్థులు ప్రభంజనం



తిరుపతి విద్య,డిసెంబర్ 30 ప్రభాతవార్త: న్యూ బాలాజీ కాలనీలోని ఎస్ డి హెచ్ ఆర్ డిగ్రీ,పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో బహుళ జాతి కంపెనీ అయినా సుతేర్లాండ్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలలో విద్యార్థులు ప్రతిభ చూపి 55 మంది ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపల్ ఎ.ఉష తెలిపారు. కళాశాల ఛైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించారని అలాగే విద్యార్థులుగా వచ్చి ఉద్యోగస్తులుగా వెళ్తున్నందుకు మా విద్యార్థులని చూసి చాల ఆనందంగా ఉంది అన్నారు. సెలెక్ట్ అయినా విద్యార్థులని కోర్స్ కంప్లీట్ అయినా వెంటనే జాబ్ లో జాయిన్ అవుతారని తెలియజేసారు.ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.హెచ్ ఆర్ మేనేజర్ మెర్లిన్,హెచ్ఆర్ రిక్రూటర్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు జాగ్రత్తగా వుండాలి

నింద్ర,డిసెంబరు 30 ప్రభాతవార్త :నూతన సంవత్సరం జనవరి ఒకటోవ తారీఖీన ప్రజలు జాగ్రత్తగా వుండాలని నింద్ర యస్ఐ మల్లీఖార్జున్ తెలిపారు. మంళవారం మండల కేంద్రంలో నింద్ర యస్ఐ మల్లీఖార్జున్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నూతన సంవత్సరం వేడుకలు నిర్వహించుకొనేవారు జాగ్రత్తలు పాటించాలన్నారు. బహిరంగ ప్రదేశాలల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తాం అన్నారు.

## నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పదు

కార్వేటినగరం,డిసెంబరు 30 ప్రభాతవార్త: నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పదని కార్వేటినగరం యస్ఐ తేజస్విని తెలిపారు.నూతన సంవత్సరం సంబరాల్లో భాగంగా మద్యంతాగి వాహనాలు నడపడం, యువత వాహనాలను అతి వేగంగా నడిపి విన్యాసాలు చేయడం,ద్విచక్రవాహనాలకు సైలెన్సులు తీసి శబ్దకాలుష్యాలు చేయడం,రోడ్లపై కేకులు కట్ చేసి, బాణాసంచాలు పేల్చడం ఇలాంటి వాటిని పూర్తిగా నిషేదించడమైనదన్నారు.

## యుటిఎఫ్ క్యాలండర్ల ఆవిష్కరణ



తొట్టంబేడు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం యుటిఎఫ్ క్యాలండర్లను ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి డివిజన్ 2026 క్యాలండర్లను డైరీలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిధిగా జిల్లా కోశాధికారి మోహన్‌బాబు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి డివిజన్ కన్వీనర్ వెంకటకృష్ణయ్య, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, సూర్య ప్రకాష్, జిల్లా కార్యదర్శులు హేమంబరధరరావు, విజయశ్రీ, ఆడిట్ కమిటి సభ్యులు శివకుమార్, దీపిక గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈదల కాలువలో గుర్తుతెలియని మహిళ శవం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి సమీపంలోని ఈదల కాలువలో గుర్తుతెలియని మహిళ శవాన్ని రూరల్ పోలీసులు కనుగొన్నారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు బహుశా ఆమె హిందీ ఆమెగా పోలీసులు భావిస్తున్నారు. బతుకు జీవనం కోసం ఇక్కడకు వచ్చినట్లు పోలీసులు ఆమె కట్టుబొట్టును బట్టి అంచనా వేస్తున్నారు. అయితే కాలవలో ఎందుకు శవంగా మారిందనే దిశగా విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు మూడు రోజుల ముందు కాలువలో పడేసినట్లు వివరించారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసునమోదు చేసి విచారిస్తున్నట్లు వివరించారు.

## ప్రజా దర్బార్‌తో సమస్యలకు చెక్ : ఎమ్మెల్యే



సత్యవేడు, డిసెంబరు 30 ప్రభాతవార్త: ప్రజా దర్బార్ కార్యక్రమంతో ప్రజల సమస్యలకుచెక్ పెట్టనున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదిమూలం సత్యవేడు మండలంలో సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మొదటిగా సత్యవేడు మండలంలోని వెంకటరాజుల కండ్రిగకు చేరుకుని ఉపాధిహామీ పల్లె పండుగ 2.0పథకం ద్వారాసీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం సత్యవేడుకు చేరుకుని నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులతో కలసి ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. సత్యవేడులో తలపెట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి 150 అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీలను పరిశీలించి చిన్న సమస్యలను అక్కడే ఉన్న ఎంపీడీవో, తహసీల్దార్‌లతో పాటు ఇతర శాఖల అధికారుల ద్వారా అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం మదనపల్లి కూడా జిల్లా కేంద్రం అయిన నేపథ్యంలో బస్సు ఆవశ్యకతను వివరించారు

## వేడుకల్లో హద్దుమీరితే చర్యలు : సిఐ



కోట,డిసెంబర్ 30 ప్రభాతవార్త: వాకాడు సర్కిల్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని వాకాడు సిఐ హెస్సెన్ బాష కోరారు. ఆయన మంగళవారం విలేరకర్లతో మాట్లాడారు. నూతన సంవత్సర వేడుకల జోష్ ఊపుందుకుంది. వేడుకలను అందరూ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆనందంగా గడపాల్సిన సమయంలో హద్దులు దాటోద్దని ఆయన హెచ్చరించారు. రోడ్లుపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడతమన్నారు.మితిమీరే ఉత్సాహం తో ప్రమదాలను కొని తెచ్చుకొవద్దున్నారు.బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాడగం నిషేదం, మైనర్లకు ద్విచక్రవాహనం ఇవ్వోదు, 18 ఏళ్ల లోపు వారు వాహనం నడిపితే యాజమనిపైన కేసు నమోదు చేస్తామన్నారు. డీజేలతో హోరెత్తించడం నిషేధమన్నారు. వాహనాలపై ర్యాలీలు వేళ్లడం కదరదున్నారు. తల్లిదండ్రులు పిల్లలను వేడుకలకు బయటకు పంపొద్దనేది పోలీస్ వారి సూచనని పేర్కొన్నారు.సర్కిల్ ప్రజలు ప్రశాంత వాతవణంలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని ఆయన కోరారు. ముందుగా ప్రజలకు ఆయన నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

## సిద్దవరంలో పౌరహక్కుల దినోత్సవం

కోట,డిసెంబర్ 30 ప్రభాతవార్త: భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోట మండల తహిసీల్దార్ కె.జయజయరావు కోరారు . మంగళవారం మండల పరిధజలోని సిద్దవరంలో గిరిజన కాలనీలో పౌరహక్కుల దినోత్సవం ను తహిసీల్దార్ కె.జయజయరావు అధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ పథకాల అమలు పై ప్రజలకు వివరించారు. ఒక దేశ పౌరుడిగా తెలుసుకోవాల్సి కొన్ని బాధ్యతలను వివరించారు.భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను, విధులను వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ మునికుమారి, డిప్యూటి తహసిల్దార్, మల్లిఖార్జున్‌రావు,తదితరులు ఉన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**- కోటలో టిడిపి సంబరాలు**



కోట, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గంలో అంతర్భాగమైన కోట మండలాన్ని నెల్లూరు జిల్లాలో కలపడం పట్ల మంగళవారం కోటలో తెలుగుదేశం పార్టీ నాయకులు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కోట మండల టిడిపి అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ తదితరులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని అశాస్త్రీయంగా తిరుపతి జిల్లాలో విలీనం చేశారని తెలిపారు. గత మూడేళ్లుగా ప్రజలు అవసరాల నిమిత్తం తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లలేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా నాటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు, నారా లోకేష్‌లు గూడూరు నియోజకవర్గంలో ఎన్నికల పర్యటనలో భాగంగా తాము అధికారంలోకి వస్తే ఈ నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. హామీ మేరకు నేడు గూడూరు, చిల్లకూరు, కోట మండలాలను నెల్లూరు జిల్లాలో కలపడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎంతో కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, కొత్తపాలెం సొసైటీ అధ్యక్షుడు ఉచ్చూరు రవీంద్రారెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, పలగాటి జితేంద్రరెడ్డి, మర్రి పోలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెంగల్‌రావు, రఘు, పల్లెముల్లు వెంకటకృష్ణారెడ్డి, కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో వైకుంఠ ఏకాదశి వేడుకలు

**- వైష్ణవాలయాల్లో భక్తుల కిటకిట**

సూళ్లూరుపేట, డిసెంబర్ 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మంగళవారం సూళ్లూరుపేటలో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వైష్ణవాలయాలకు తరలి రావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీ మద్వేంకట రామమూర్తి దేవస్థానంలో స్వామివారికి రత్నాంగి అలంకారాన్ని చేశారు. శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. మన్నారుపోలూరు గ్రామంలోని అలఘుమల్లారి కృష్ణస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గమండ్ల వీధిలోని శ్రీ పాండురంగస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. వైష్ణవ దేవాలయాల్లో ఉత్తర ద్వారదర్శనాన్ని భక్తులకు కల్పించారు. శ్రీ మద్వేంకట రామమూర్తి దేవస్థానం మేనేజింగ్ ట్రస్టీ బీరక రాంబాబు, మాదరపాక సురేష్, మునిరాజా, పిచ్చిక శ్రీనివాసులు, ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పాండురంగస్వామి దేవస్థానంలో మాదరపాక బాలసుబ్రహ్మణ్యం, ఇతర సభ్యుల సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలఘు మల్లారి స్వామి దేవస్థానంలో టిటిడి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామోత్సవం చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఘనంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు



తడ, డిసెంబర్ 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) పర్వదినాన్ని పురస్కరించుకుని తడ కండ్రిగ గ్రామం శ్రీకాళహస్తి రోడ్డులోగల శ్రీశ్రీశ్రీ పద్మావతి సమేత శ్రీనివాస పెరుమాళ్ళ దేవస్థానం నందు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు మంగళవారం తెల్లవారుజాము నుండి స్వామివారికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం హోటల్ స్వర్ణముఖి వారి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు సాయంత్రం ఐదు గంటలకు స్వామివారికి కళ్యాణం నిర్వహించారు నిప్పో పరిశ్రమ ఎండి ద్వారకానందరెడ్డి సహకారంతో సాయంత్రం అన్నదానం నిర్వహించారు గ్రామ పెద్దలు నాగరాజురెడ్డి, మునుస్వామిరెడ్డి, రమేష్ గ్రామస్తులు సహకారంతో ఉత్సవాలు నిర్వహించారు.

## గ్రావెల్ టిప్పర్ ఢీకొని ఒకరు మృతి

పుత్తూరు(నగరి), డిసెంబరు 30 ప్రభాతవార్త : నగరి రూరల్ మండల పరిధిలో ముడిపల్లి సమీపంలోని ఏడు గట్ల వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. రూరల్ మండల పరిధిలోని ముడిపల్లి వద్ద గ్రావెల్ క్వారీ నడుస్తోంది. ఈ మార్గంలో తరచూ పదుల సంఖ్యలో వాహనాలు అతి వేగంగా వెళుతుంటాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తమిళనాడులోని గొల్లకుప్పం గ్రామానికి చెందిన చెంచుగాన్ (25)ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రావెల్ లోడ్‌తో వెళుతున్న ఒక టిప్పర్ ఢీకొంది. దాంతో శరీర భాగాలు నుజ్జుయిపోయి చెంచు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు బోరుమని విలపించారు. ఆగ్రహంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి పోలీసులు వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గూడూరు డివిజన్

## గూడూరును ముక్కలు చేయడం బాధాకరం

కోట, డిసెంబర్ 30 ప్రభాతవార్త: గూడూరు నియోజకవర్గంలో అంతర్భాగమైన వాకాడు, చిట్టమూరు మండలాలను యథావిధిగా తిరుపతి జిల్లాలో కొనసాగించడం బాధాకరమని జెఏసి నాయకులు పి.జనార్ధనం, మీజూరు మాధవ్, జెమ్మి ప్రసాద్ అన్నారు. మంగళవారం వారు కోటలో విలేఖరులతో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని రెండుగా విభజించడం సరికాదన్నారు. ఈ విషయంలో చంద్రబాబునాయుడు పునఃపరిశీలించాలని వారు కోరారు. అనేక దశాబ్దాలుగా కోట, వాకాడు మండలాల్లో రాజకీయాలు చేసిన నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిల బంధం విడదీయ రానిదన్నారు. ఈ సమావేశంలో పాల మల్లికార్జున్, పనబాక హేమంత్, ముమ్మడి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



తిరుచానూరు వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని వార్తపత్రిక సియండి డా. గిరీష్ కుమార్ సంఘీ, సినీ హీరో నారా రోహిత్, ఎడిపై పాటలు అధినేత ప్రణీత్, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికులు అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ మర్యాదలు అందజేశారు.

:ప్రభాతవార్త – తిరుచానూరు

## జిల్లా ప్రజలకు ఎస్‌పి శుభాకాంక్షలు



తిరుపతి, డిసెంబర్ 30 ప్రభాతవార్త: నూతన సంవత్సరం 2026ను జిల్లా ప్రజలందరూ బాధ్యతాయుతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కోరారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కొన్ని ఆంక్షలు మరియు భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ముఖ్య ఆంక్షలు,చర్యలు: జిల్లా వ్యాప్తంగా నిర్ణీత సమయానికి హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్లు, ఇతర వాణిజ్య సంస్థలు మూసివేయబడతాయి. జిల్లా వ్యాప్తంగా ముఖ్య పట్టణాలు, ప్రధాన రహదారులపై ప్రత్యేక పోలీస్ బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహించబడతాయి. డిసెంబర్ 31 రాత్రి మరియు జనవరి 1 తేదీల్లో జిల్లా అంతటా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.. జిల్లా వ్యాప్తంగా డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం, శబ్ద కాలుష్యం, అశ్లీల నృత్యాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తారన్నారని హెచ్చరించారు.

## సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్



**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**

పుత్తూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఎన్నికలపుడు ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న ఆదరణ దీనికి నిదర్శనంగా కనిపిస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. కూటమి ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలు సంబంధించి మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 67.27 లక్షల మందికి రూ. 10,090 కోట్లు అందించామని తెలిపారు. స్త్రీ శక్తి పథకంతో మహిళలకు ఉచిత ఆర్టీసి బస్సు ప్రయాణం కల్పించామని దీని వల్ల ఇప్పటి వరకూ 3.25 కోట్ల ప్రయాణాలు జరిగి మహిళలకు రూ. 1,144 కోట్ల లబ్ది చేకూరిందని పేర్కొన్నారు. అన్నదాన సుఖీభవ ద్వారా 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,310 కోట్లు జమ చేశామన్నారు. దీపం పథకంతో ఇప్పటి వరకూ రూ. 2,684 కోట్ల ఖర్చుతో 2 కోట్ల వంట గ్యాస్ సిలిండర్లను మహిళలకు పంపిణీ చేశామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా కింద ఇప్పటి వరకూ రూ. 50,000 కోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం చేశామన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో ఏడాదికి రూ. 15,000 కోట్లతో 2.90 లక్షల మందికి లబ్ది చేకూరిందని వివరించారు. అర్చకులకు నెలకు రూ. 15,000 వేతనం పెంపు, ఇమామ్‌లకు నెలకు రూ. 10,000 వేలు, పాస్టర్లకు నెలకు రూ. 5,000 వేలు అందిస్తున్నామన్నారు. 5,757 కానిస్టేబుళ్ల పోస్టులు, 16,000లకు పైగా టీచర్ల పోస్టుల భర్తీ చేశామన్నారు. 100 రోజుల్లోనే హంద్రీ – నీవా కాల్వ విస్తరణ, చెరువులు, ప్రాజెక్టులు నింపి రాయలసీమకు సాగునీరు ఇచ్చామని తెలిపారు. కేంద్రం నుంచి లక్ష కోట్ల విలువైన నేషనల్ హైవే ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు సాధించామని తెలిపారు.

## వైకుంఠ ఏకాదశి, బంగారు వాహనాలపై దర్శనం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: శ్రీకాళ హస్తిలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళ వారం ఉదయం స్వామి అమ్మవార్లు బంగారు వాహనాలపై దర్శనమిచ్చారు.స్వామి వారిని బంగారు శేష వాహనంపై అమ్మవారిని బంగారు యాళీవాహనంపై ప్రతిష్టించారు. స్వామి అమ్మ వార్లను అలంకార మండపంలో చక్కగా ముస్తాబు చేసి వాహనాల మండపం వద్ద బంగారు వాహనాలపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. తేరువీధిలో స్వామి అమ్మవార్ల మిరాసిదారులు ఎస్ఎంకె పరశురాం గురుకుల్(అచ్చితా) హారతులిచ్చారు.ఊరేగింపును సమయ పాలనతో తీసుకురావటంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజాలు వెంటరాగా ఊరేగింపు సాగింది. అలాగే గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహించారు.

## సమిష్టి కృషి...సమన్వయ సేవలు

**-తొలిరోజు వైకుంఠదర్శనాలు విజయవంతంపై హర్షం**





తిరుమల,డిసెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన ధనుర్మాసంలో ఇలవైకుంఠం వెంకన్న ఆలయంలో వైకుంఠద్వార దర్శనాల్లో తొలిరోజు ఏకాదశిని పూర్తిస్థాయిలో టిటిడి అధికారులు, పోలీస్, విజిలెన్స్ అధికారులు సమిష్టి కృషి, సమన్వయ సేవలతో భక్తజనం పులకించారు. గతంకంటే భిన్నంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో టోకెన్లు విడుదల చేసి అందుకున్న భక్తులను మాత్రమే ఆలయంలోనికి అనుమతించినా, టోకెన్ లేని భక్తులకు ఆలయం వెలుపల, మాఢవీధుల్లో చక్కటి ఏర్పాట్లతో, ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దిన ఆలయాల నమూనాలతో భక్తులు వైకుంఠదర్శనం చేసుకున్నంత పుణ్యం కలిగిందని విశ్వాసం వ్యక్తం చేయడం విశేషం.తొలినుండి పక్కావ్యూహంతో అమలుచేసిన ప్రణాళికలతో భారీగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చినా స్వయంగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ అనిల్ కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ వర్గాలు పర్యవేక్షించి దర్శనాలు చేయించారు. ఆ తరువాత సామాన్య భక్తులు ఆలయంలోనికి ప్రవేశించడంతో వైకుంఠంలా అనుభూతి పొందారు. సాధారణరోజుల్లోనూ గోవిందుని దర్శనానికి 90వేల మంది వరకు భక్తులు వచ్చినా అధికారులు సమన్వయంతో సేవలందించి భక్తులకు శ్రీవారి దర్శనం చేయిస్తున్నారు. అలాంటిది మంగళవారం టోకెన్ కలిగిన భక్తులు 65వేలమంది, ప్రముఖులు పదివేలమంది వరకు ఉన్నా అశేషభక్తులకు భద్రతతో బాటు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ,టీ పంపిణీ చేయడం భక్తుల్లో సంతోషం కలిగించింది. రెండు నెలల నుండి తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా యంత్రాంగం, టిటిడి విజిలెన్స్‌విభాగం, టిటిడిలోని అన్ని విభాగాలు, రెండువేలమంది పోలీసులు సమన్వయం సమిష్టి కృషితోనే సాధ్యమైంది. సకల సౌకర్యాలు కల్పించి, తొలిరోజే భక్తుల పరవశం వెనుక కృషిచేసిన ,సేవలందించిన ప్రతి ఒక్కరినీ పేరు పేరునా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి స్వయంగా శ్రీవారిసేవకులు, సిబ్బంది పనితీరును అభినందించారు.

## వైకుంఠ దర్శనం ముక్తికి సోపానం

**-తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్**



తిరుమల,డిసెంబర్ 23ప్రభాతవార్తప్రతినిధి: పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి ఘడియల్లో శ్రీవారి ఆలయంలో వైకుంఠద్వార దర్శనం ముక్తికి సోపానమని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం వేకువజామున కుటుంబంతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. హారతి లేని లఘు దర్శనంలో వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు.

## వైకుంఠ ఏకాదశి వేడుక సందడి





నారాయణవనం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి ఆలయాలు వేలాదిమంది భక్తులతో కిటకిటలాడింది. ప్రధానంగా నారాయణవనంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయాలైన పద్మావతీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరుని ఆలయం, ఆంజనేయస్వామి, చంపకవల్లీ సమేత పరాశారేశ్వరుని, భద్రకాళి సమేత వీరభద్ర, సముదాయంలోని శక్తి వినాయక, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుడు, సముదాయంలో అవనాక్షమ్మ, తాతాసౌరకాయులస్వామి, కైలాసనాథకోన, తుంబూరులోని తుంబూరీశ్వరుని, పాలమంగళం పాలీశ్వరస్వామి, శింగరికోనలోని లక్ష్మీనరసింహాస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధానంగా కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో తెల్లవారుజామున 4.30 గంటకు ఆలయాన్ని తెరిచి శుద్ధి నిత్యకైంకర్యపూజలతో పాటు తిరుప్పావై ప్రవచనంతో శ్రీవారిని మేల్కొల్పారు. ధనుర్మాసపూజల అనంతరం శుద్ధి, నిత్యకైంకర్య పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 5గంటల నుంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే పుత్తూరు, నగరి, పిచ్చాటూరు, నారాయణవనం, వడమాలపేట తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి, తమిళనాడు తదితర ప్రా ంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కైలాసనాథకోనలో ఉదయం నుంచి రాత్రి వరకు వేలాదిమంది భక్తులు తరలివచ్చి పవిత్రస్నానాలను చేసిన తర్వాత అమ్మవారి, స్వామిని దర్శించుకున్నారు. నాగలేరు సమీపంలోని శింగరికోనలో లక్ష్మీనరసింహుని దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు పోటేత్తారు.

## నేడు కల్యాణ వెంకన్న ఆలయంలో ఉత్తర ద్వాదశి ద్వారా ప్రవేశం



నారాయణవనం, డిసెంబర్ 30 ప్రభాతవార్త: మంగళవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మరుసటి రోజైన నేడు (బుధవారం) నారాయణవనంలో వెలిసిన టిటిడి ఆలయం అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలోని ఉత్తర ద్వాదశిద్వారా ప్రవేశం ఉదయం 9 గంటలకు స్వామి వారి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు టిటిడి అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటల వరకు ఉత్తర ద్వాదశిద్వార ప్రవేశం వుంటుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు ప్రభాతవార్తకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి రోజునే దేశంలోని అన్ని వైష్ణవ దేవాలయాల్లో ద్వాదశిద్వారా ప్రవేశ ం వుంటుందని, అయితే తమిళనాడు రాష్ట్రం శ్రీరంగంలో వెలసిన రంగనాథస్వామి ఆలయంలోను, నారాయణ వనంలో వెలసిన కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో మాత్రం మరుసటి రోజు అనగా ద్వాదశి నాడు ఉత్తర ద్వారా ప్రవేశం వు ంటుందన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు దేవుళ్ల వైకుంఠానికి వెళ్లడం వల్ల అదే రోజు భక్తులు జాగారం చేసిన తర్వాత ద్వాదశి ద్వారా ప్రవేశం చేస్తే శతకోటి పుణ్యం లభిస్తుందని అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. కావున భక్తులు వేలాది సంఖ్యలో తరలివచ్చి ద్వాదశి ద్వారం ప్రవేశం చేసుకోవాలని కోరారు. ఇందుకోసం భక్తుల తాకిడి అధికంగా వుండడం వల్ల ప్రత్యేక హైలెవల్ క్యూలైన్లను, ప్రత్యేక దర్శనం టికెట్, పాదరక్షల భద్రత కోసం కౌంటర్, ప్రసాదాల పంపిణీ కోసం నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## అప్పలాయగుంటకు పోటెత్తిన భక్తజనం

**వీఐపీల తాకిడితో ఇబ్బంది పడ్డ సామాన్య భక్తులు**



వడమాలపేట, డిసెంబరు 30 ప్రభాతవార్త: వైకుంఠ ఏకాదశి సందర్భంగా అప్పలాయగుంట భక్తజనంతో నిండి పోయింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి వేలాది మంది భక్తులు అప్పలాయ గుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని దర్శించి, వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి తిరుప్పావైతో స్వామివారిని మేల్కొలిపి, ధనుర్మాస కైంకర్యాలు, తోమాలసేవ కొలువు, అర్చన విశేష కార్యక్రమాలు పూర్తిచేసి 1.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించారు. చలిని కూడా లెక్క చేయకుండా భక్తులు ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు వేలాది మంది భక్తులు ప్రత్యేక సర్వదర్శనం చేసుకున్నారు. మధ్య..మధ్యలో...వీఐపీలు వల్ల సామాన్య భక్తులు ఇబ్బంది పడ్డారు. దర్శనానికి రెండు గంటలకు పైగా క్యూ లైన్‌లలో వేచి ఉండాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లల తల్లులు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనానికి పంపించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు తిరువీధి ఉత్సవం జరిగింది. శ్రీదేవి భూదేవిసమేతుడై స్వామివారు తిరుచ్చి వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారి వేణుగోపాల్, టీటీడీ అధికారులు, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## భక్తుల సదుపాయాల కల్పనలో మొదటి స్థానం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 30 ప్రభాతవార్త: దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సదుపాయాల కల్పనలో పారిశుద్ధ్య నిర్వహణలో మొదటి స్థానం శ్రీకాళహస్తికి రావటం ఇక్కడ పరిపాలనకు నిదర్శనం అని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని దర్శించు కున్నారు. మీడియాతో మాట్లాడుతూ గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఆదాయం చాలా తక్కువగా ఉండేదని దానిని కనీసం రూ.వంద కోట్లు చేయాలని నాడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆశయం అయితే ఆయన కల నెరవేరిందని చెప్పవచ్చునన్నారు. నేడు ఈ ఆలయ ఆదాయం రూ.250కోట్లుకు చేరుకుందన్నారు. భక్తుల సదుపాయల కల్పనలో అధికారులు,పాలకులు చూపినశ్రద్ధతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జరిపిన సర్వేలో మొదటి స్థానం వచ్చిందన్నారు.ఆలయాలకు వస్తున్న భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు తీసుకుంటున్న చర్యలతో వచ్చేభక్తుల సంఖ్య పెరిగిందన్నారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ఆయనకు ధర్మకర్తల మండలి సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, గోపినాథ్, లక్ష్మమ్మలు ఉన్నారు. ఏర్పాట్లను ఎఇఒ మోహన్ పర్యవేక్షించారు.

## 26 శాతం తగ్గిన నేరాలు

**- పటిష్టంగా కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థ- మహిళా భద్రత కోసం 6 శక్తి బృందాలు**

**- రూ.2.04 కోట్ల విలువైన 1,021 మొబైల్ ఫోన్లు రికవరీ - సైబర్ ఫ్రాడ్ బాధితులకు రూ.68 లక్షలు రికవరీ చేసి అప్పగింత - జిల్లా పోలీసు వార్షిక నివేదికలో ఎస్పీ తుషార్ డూడి వెల్లడి**

చిత్తూరు, డిసెంబర్ 30 ప్రభాతవార్త: జిల్లాలో 2025 సంవత్సరంలో 26 శాతం నేరాలు తగ్గుముఖం పట్టాయని ఎస్పీ తుషార్ డూడి వెల్లడించారు. చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీసు వార్షిక నివేదిక వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గత ఏడాది 7,034 కేసులు నమోదు అయితే ఈ ఏడాది కేవలం 5,216 కేసులు మాత్రమే నమోదై సుమారు 26 శాతం తగ్గాయన్నారు. జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్ వ్యవస్థను పటిష్టం చేసి శాంతి భద్రతలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మహిళలపై గత ఏడాది 507 అత్యాచారాలు, వరకట్న వేధింపులు, దాడులు జరిగితే ఈ ఏడాది 443 అత్యాచారాలు, దాడులు జరిగాయన్నారు. గత ఏడాది ఫోక్సో కేసులు 46 నమోదైతే ఈ ఏడాది 56 నమోదయ్యాయని, అలాగే గత ఏడాది రోడ్డు ప్రమాదాలు 748 జరిగితే ఈ ఏడాది 771 జరిగాయన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఈ ఏడాది 5 కేసులు నమోదు చేసి 12 మంది స్మగ్లర్లు, మేస్త్రీలు, కూలీలను అరెస్టు చేసి రూ.83.20 లక్షల విలువైన 1,523 కేజీల ఎర్రదుంగలు, 6 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది జనవరి 29న బంగారం కోసం వృద్ధురాలిని హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి రూ.13 లక్షల విలువైన 173 గ్రాముల బంగారంను స్వాధీనం చేసుకున్నామన్నారు. జనవరి 30న చిత్తూరు వన్‌టౌన్ పరిధిలోని దొడ్డిపల్లిలోని ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను పట్టుకుని వారి నుండి రూ.19.42 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో మునిసిపల్ పాత్ర పోషిద్దాం

**వైస్ ఛైర్మన్ జయప్రకాశ్**



పుత్తూరు, డిసెంబరు 30 ప్రభాతవార్త : పుత్తూరు పట్టణంలో రోజురోజుకీ ఇబ్బందికరంగా పరిణమిస్తున్న ట్రాఫిక్ రద్దీ విషయంలో మునిసిపాలిటీ పరంగా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై వుందని మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి)అన్నారు. ట్రాఫిక్ క్రమబద్దీకరణలో పోలీస్ శాఖ నుంచి అందాల్సిన సహకారాన్ని పక్కన పెడితే మునిసిపాలిటీ తరపున తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టి అమలు చేయాలని సూచించారు. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో ఛైర్మన్ ఎ.హరి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కూరగాయల అంగళ్లు, ఇతర చిన్న వ్యాపారాలు జరుగుతుండడం వల్ల రోడ్డు ఆక్రమణకు గురై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రధాన రోడ్డుకు 5 అడుగుల లోపల వ్యాపారాలు చేసుకోవాల్సి వుండగా రోడ్లపైకి వచ్చి అంగళ్లు పెడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్‌ను సరిదిద్దే క్రమంలో పోలీస్ తదితర శాఖలపై నెపం పెడుతూ కుంటి సాకులు చెప్పకుండా మునిసిపాలిటీ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటే తప్ప సమస్య ఎప్పటికీ పరిష్కారం కాదని స్పష్టం చేశారు. పట్టణంలో కుక్కల బెడదను నివారించేందుకు వాటిని లక్షల రూపాయల వ్యయంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు లేదా ఇంజక్షన్‌లు చేయడం వల్ల ఫలితం వుందని తెగేసి చెప్పారు. కుక్కల జనాభా సంఖ్యను తగ్గిస్తూ...ప్రజలకు వాటి నుంచి ప్రమాదం తప్పిందని అనుకోవడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. గతంలో పది లక్షలకు పైగా ఖర్చు పెట్టి కుక్కలకు ఇంజక్షన్‌లు వేశారని, దాని వల్ల ఏ మాత్రం ప్రయోజనం లేదని ఇప్పటి పరిస్థితులు రుజువు చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లలు ధైర్యంగా వీధుల్లోకి రావాలంటే కుక్కలను పట్టుకుని అడవుల్లో వదలడం ఒక్కటే సరైన పరిష్కారమని తెలిపారు. మునిసిపల్ పార్కుల్లో పబ్లిక్ టాయలెట్లు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుందన్నారు. ఛైర్మన్ హరి మాట్లాడుతూ పట్టణంలో ప్రకటనలకు సంబంధించి హోర్డింగ్‌ల ఏర్పాటు కోసం కొందరు ఇష్టం వచ్చినట్టు శాశ్వత ప్రాతిపదికన ఇనుప స్తంభాలు నాటుతున్నారని, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు పోల్స్ నాటారని తెలిపారు. మునిసిపల్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ... ఆ మేరకు చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. అనంతరం వివిధ పనులకు సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ నాగేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ డి.శంకర్, పలువురు కౌన్సిలర్లు, అధికార సిబ్బంది పాల్గొన్నారు.